సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 12 । జూలై । 2025



పట్టించుకోరు..

జడ్చర్లలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.5.50 కోట్లతో ప్రతిపాదించారు.

వివరాలు 8లో ▸



నిండుగా.. జూరాల

ఎగువ నుంచి వరదతో జూరాల ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /23.2

వాతావరణం

జిల్లావ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సీ, ఎస్టీ కేసులపై విచారణ వేగవంతం



గద్వాల క్రైం: గద్వాల డీఎస్పీ కార్యాలయాన్ని శుక్రవారం ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మొగిలయ్యతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులపై విచారణ వేగవంతం చేయాలని, నకిలీ విత్తనాల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

గద్వాల: తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మధ్యలో చదువు మానేసిన వారు, ఉన్నత విద్య చదువుకోవాలి అనుకునేవారి, ఉద్యోగం చేస్తూ చదువు కొనసాగించాలి అనుకునేవారికి ఇది చక్కటి అవకాశమని అన్నారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యూలర్ విద్యాసంస్థల ద్వారా పొందే సర్టిఫికెట్‌తో సమానమని, దీని వల్ల ఉన్నత విద్య, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగ అవకాశాల పదోన్నతులు తదితర అవకాశాలకు వీలుంటుందని పేర్కొన్నారు.

చేనేత వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

గద్వాల: చేనేత కార్మికులకు తమ వృత్తిలో నైపుణ్యంతో పాటు సాంకేతికంగా అభివృద్ధి చెందే విధంగా జిల్లాలో టీపీసీ, ర్యాంపు పథకం జగదీష్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ జగదీష్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో చేనేత కార్మికులకు మాస్టర్ వీవర్స్ ర్యాంపు, ఎగుమతులు, దిగుమతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరగౌడ్ మాట్లాడుతూ గద్వాల చేనేల చీరలకు ఉన్న డిమాండ్ అనుసరించి సరికొత్త సాంకేతిక మెరుగు పర్చుకోవడానికి ర్యాంపు ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, స్కిల్ ట్రెనింగ్ ఇన్స్టిట్యూట్ డెరెక్టర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ కళాశాలలో ఉద్యోగ మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళాను మ్యాజిక్ బస్ టిక్ మహీంద్ర, ముతూట్ ఫైనాన్స్, వైసీస్ క్లౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మేళాలో మొత్తం 200 మంది విద్యార్థులు పాల్గొనగా.. 50 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మాఅనురాధ, అమీనా ముంతాజ్, శ్రీదేవి, హరిబాబు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలంపాడులో కదలిక

సాగునీటి పారుదల శాఖ మంత్రి పర్యటనతో మరమ్మతు పనుల్లో చలనం

ర్యాలంపాడు జలాశయం ఆనకట్ట



- ఐదేళ్ల క్రితం జలాశయానికి గండి
- 2024 డిసెంబర్‌లో రూ.137 కోట్ల అంచనాతో నివేదిక
- ఏప్రిల్‌లో పూణెకు చెందిన సీడబ్ల్యూసీ సంస్థ నిపుణుల బృందం సందర్శన

గద్వాల: రూ.వేల కోట్లు వెచ్చించి నిర్మించిన ర్యాలంపాడు సాగునీటి ప్రాజెక్టు కొందరు అవినీతి అధికారులు, కాంట్రాక్టర్ల వల్ల ప్రమాదంలో పడింది. అందుబాటులోకి వచ్చిన ఏడాది కాలంలోనే జలాశయం మొదలుకొని, కుడి, ఎడమ తూముల అడుగుభాగాల్లో ఏర్పడిన లీకేజీలతో రూ.కోట్ల ప్రజాధనం నీట కొట్టుకుపోతుంది. దీనిపై పలుమార్లు సర్వేలు, డీపీఆర్ నివేదికలు గత, ప్రస్తుత ప్రభుత్వాలకు సమర్పించినా చలనం లేకుండా పోయింది. ఎట్టకేలకు ఇటీవల సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్షేత్రస్థాయిలో జలాశయాన్ని సందర్శించడంతో పాటు అధికారులతో వివరాలు సేకరించారు. ఈనేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో మరమ్మతు కోసం సమగ్ర సర్వేకు అవసరమైన నిధుల మంజూరు అవుతున్నట్లు తెలిసింది.

2022లో రిపోర్ట్ అందజేత

సదరు సంస్థ 2022 మార్చిలో సర్వే పనులు చేపట్టి లీకేజీల మరమ్మతుకు సుమారు రూ.137 కోట్లు వ్యయం అవుతుందని 2023 జనవరిలో ఇరిగేషన్ శాఖకు రిపోర్ట్ అందించారు. అంచనాలు రూపొందించిన అధికారులు తుది నివేదికను 2024 డిసెంబర్‌లో ప్రభుత్వానికి సమర్పించారు. అనంతరం ఈ ఏడాది ఏప్రిల్‌లో పుణెకు చెందిన సీడబ్ల్యూసీ సంస్థ ఇంజినీర్ల నిపుణుల బృందం ర్యాలంపాడును సందర్శించి లీకేజీలను పరిశీలించారు. మరోసారి సర్వే చేసేందుకు రూ.1.86 కోట్లు అవసరం అవుతుందని నిపుణుల బృందం ఇరిగేషన్‌శాఖ ఈఎన్‌సీకి వివరించారు. విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వివరించడంతో రెండు, మూడు రోజుల్లో అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేసేందుకు సముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నడిగడ్డలో 2లక్షల ఎకరాలకు..

నడిగడ్డ ప్రాంతమైన గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సుమారు రూ.2వేల కోట్లతో నెట్టెంపాడు ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 14ప్యాకేజీలు, రెండు లిఫ్టులు, ఏడు జలాశయాలు నిర్మించారు. సంగాల, చిన్నోనిపల్లి జలాశయాలు స్టాండ్‌బై కింద కేవలం నీటిని నిల్వ చేసుకునేందుకు నిర్మించగా.. మరో 5 జలాశయాలు ఆయకట్టుకు నీరు అందించేలా డిజైన్ చేశారు. ఇందులో ర్యాలంపాడు జలాశయం కింద ధరూరు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల్లో 1.05లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4టీఎంసీలు. మరోవైపు 1.30టీఎంసీల సామర్థ్యంతో 1.36లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.580 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతలకు కూడా అవసరమైన 2.80టీఎంసీల నీటిని ర్యాలంపాడు జలాశయం నుంచే ఎత్తిపోసేలా నిర్మాణం చేపడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

మరమ్మతుకు సంబంధించి గతంలో తయారు చేసిన నివేదిక రాష్ట్ర ఉన్నతాధికారుల టెక్నికల్ విభాగం పరిశీలనలో ఉంది. అయితే మళ్లీ పూణెకు చెందిన సీడబ్ల్యూసీ సంస్థతో సమగ్ర సర్వే చేయించేందుకు రూ.1.86 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు వచ్చిన వెంటనే సర్వే పనులు మొదలువుతాయి. – రహీముద్దీన్, ఎస్ఈ, ఇరిగేషన్‌శాఖ

జలాశయానికి గండి..

ఇంతటి ప్రాధాన్యత ఉన్న ర్యాలంపాడును గుత్తేదారు చేపట్టిన లోపభూయిష్టమైన నిర్మాణం, కొరవడిన అధికారుల పర్యవేక్షణతో ఏకంగా జలాశయానికి గండిపడింది. జలాశయం అడుగుభాగాన రాక్‌టోల్ నుంచి పలుచోట్ల లీకేజీలు ఏర్పడి జలాశయం నుంచి నీరు బయటకు ఉబికి వస్తుండడాన్ని ఇరిగేషన్ అధికారులు మూడేళ్ల కిందటనే గుర్తించారు. తర్వాత సీఈ స్థాయిలో నిపుణుల కమిటీ జలాశయాన్ని సందర్శించి లీకేజీలు, అందుకు గల కారణాలు తెలుసుకొని, మరమ్మతు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు సర్వే పనులు అప్పగించింది. ఇందుకోసం రూ.57లక్షలు వెచ్చించారు.



జలాశయానికి ఏర్పడిన లీకేజీలను పరిశీలిస్తున్న పూణెకు చెందిన ఇంజినీర్ల బృందం

శాకంబరీదేవి నమోస్తుతే..



శాకంబరిదేవి అలంకరణలో అన్నపూర్ణేశ్వరిదేవి

అమ్మవారికి కూరగాయలే వస్త్రాభరణములు కాగా.. **ఆకుకూరలు, ఫలాలు మాలలు** అయ్యాయి. నవర**త్నాలు పొదిగినట్లుగా గుమ్మడి** కాయలు, క్యాబేజీ, **క్యారెట్లు స్వర్ణ కిరీటాలయ్యాయి. కం**ద మాలలు జటా **మకుటాలుగా అలంకరించగా..** జిల్లా కేంద్రంలోని **వివిధ ఆలయాలలో అమ్మవారు శా**కంబరిదేవి అలంక**రణలో మెరిసిపోయారు. శుక్రవారం** జమ్ములమ్మ ఆల**యం, అయ్యప్పస్వామి సన్నిధిలో**ని అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆషాడమాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకాంబరిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు పండితులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. – గద్వాలటౌన్

పంచాయతీ భవన నిర్మాణాలు వేగవంతం



గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగ్‌రావు, డీపీఓ నాగేంద్రం

ఉండవెల్లి: పంచాయతీ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ నర్సింగ్‌రావు ఆదేశించారు. మండలంలోని మారమునగాల–2కి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం మంజూరు కాగా.. ఇటీవల పైకప్పు పనులు పూర్తి కావడంతో శుక్రవారం ఆయ పరిశీలించారు. నిర్మాణానికి త్వరలో నిధులు విడుదల అవుతాయని, పనులు నాణ్యతగా చేపట్టాలని, నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన చేయడంతోపాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు. ఇదిలాఉండగా, పాఠశాలలో బాత్రూంలు, తాగునీటి సమస్య ఉందని తెలపడంతో.. త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం వనమహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఓ నాగేంద్రం, ఎంపీడీఓ తిరుపతన్న, ఏపీఓ సౌజన్య, టీఏ రామచంద్రుడు, బుచ్చమ్మ, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ బానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి అనిష్ పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

ఇటిక్యాల: నాటిన ప్రతి మొక్క పెరిగే వరకు సంరక్షించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నక్కలపల్లి, కొత్తదేవరల్లి గ్రామాల నర్సరీలను సందర్శించి మొక్కలను పరిశీలించారు. అదేవిదంగా పాఠశాల అవరణలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ సంరక్షణ, వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఆకాక్షించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నాటే మొక్కలను పెంచే నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. నర్సరీలలోని మొక్కలను ఎండ నుంచి సంరక్షించుకునే అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కొత్తదేవరపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. నూతన అంగన్‌వాడీ కేంద్రం పనులను పరిశీలించి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

భూభారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులు త్వరగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో భూ బారతి, రేషన్ కార్డుల ధ్రువీకరణ, మీ–సేవ దరఖాస్తులు ఎఫ్–లైన్ పిటిషన్లపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి ద్వారా భూమి వివాదాలు తగ్గి రైతులకు, భూ యాజయానులకు శాశ్వత న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని దరఖాస్తులపై తదుపరి చర్యలకు ముందు త్వరగతిన నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పూర్తిగా పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా పౌరసరఫరా అధికారి స్వామి ఉన్నారు.

మానిటరింగ్ సభ్యులతో సమావేశం

జిల్లా అభివృద్ధికి సంబంధించి జాతీయ స్థాయి మానిటరింగ్ సభ్యులు చేసిన సూచనలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని, వాటిని పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నందు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ తరఫున జిల్లాలో పర్యటించిన సభ్యులు సివి బాలమురళి, ఆర్ రాధిక కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా గ్రామీణభివృద్ధిలో వేగంగా పురోగమిస్తుందని అభిప్రాయపడ్డారు. వారు ఇటీవల పలు గ్రామాల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలో ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ మిషన్, పక్కా ఇళ్ల నిర్మాణం, నీటి వసతి, మౌలిక వసతులు తదితర వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మోతాదుకి మించి ఎరువులు వాడొద్దు



అలంపూర్‌లో ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

అలంపూర్: రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడవద్దని, నూతన సాంకేతిక పద్ధతిలో వచ్చిన నానో యూరియా, నానో డీఏపీ వాడాలని, అలాగే వానాకాలం పంట సీజన్‌లో ఎరువుల కొరత ఉండదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని పీఏసీఎస్ గోదాంలో నిల్వ ఉన్న యూరియా, రికార్డులను పరిశీలించి యూరియా 400 బస్తాలు, డీఏపీ 150 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. పంట సాగుకు అనువుగా ఎరువులు ఉన్నాయన్నారు. అనంతరం రైతులకు యూరియా, నానో డీఏపీ, యూరియాను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్ రెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిరాం పాల్గొన్నారు.

అంతర కృషితో లాభాలు

అంతర కృషితో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని డీఏఓ అన్నారు. ఉండవెల్లి మండలంలోని మారమునగాల, తక్కశీల, కంచుపాడు, ఉండవెల్లి గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, కంది వంటి పంటలను పరిశీలించారు. డి–బూడ్దిపాడు గ్రామంలో సర్వప్రకాష్ రెడ్డి సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. పంట సాగులో సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం, సకాలంలో అంతర కృషి వలన కలిగే లాభాలను వివరించారు. పంట వేసిన 40 రోజులు పొలంలో గడ్డి మొక్కలు, కలుపు నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు.

డివైడర్ పనుల ఆలస్యంతో ట్రాఫిక్ సమస్య



అలంపూర్ మున్సిపాలిటీలో డివైడర్ పనులతో నిలిచిన బస్సు

అలంపూర్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల ఆలస్యంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమయ్యాయి. నెలల తరబడిగా నిలిచిన పనులు ఇటీవలే పునః ప్రారంభించారు. పనులు నిదానంగా చేపడుతుండడంతో ప్రజలు, యాత్రికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అలంపూర్ మున్సిపాటీలో డివైడర్ విత్ సెంట్రల్ లైటింగ్ పనులు 15 రోజుల క్రితం ప్రారంభించారు. అందులో భాగంగా రోడ్డు మధ్యలో తవ్వకాలు చేపట్టారు. రోడ్డు విస్తరణ చేపట్టే కంటే డివైడర్ పనులు చేపడుతున్నారు. దీంతో జోగుళాంబ క్షేత్రానికి యాత్రికులతో వస్తున్న ట్రావెల్స్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, లారీలు గాంధీ చౌక్ వద్ద మలుపు తీసుకోవడానికి సాధ్యపడటం లేదు. భారీ వాహనాలు మధ్యలోనే నిలిచిపోతుండటంతో నిత్యం వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో తీవ్ర అసౌకర్యంగా మారింది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ఈ సమస్య తలెత్తుందని స్థానికులు అందోళన వ్యక్తం చేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయకుండా డివైడర్ కోసం తవ్వకాలు చేపట్టడంతో బస్సులు, భారీ వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివేకానంద యూత్ సొసైటీ అధ్వర్యంలో స్థానిక ఆయా పార్టీల నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు శ్రీరాములుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ముందుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన అనంతరం డివైడర్ పనులు చేపట్టాలని, యాత్రికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



డివైడర్ కోసం తవ్విన రోడ్డు

వైద్యులు నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

- ఆస్పత్రికి వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలి
- ట్రామా కేర్ సెంటర్, జిల్లాకు ఓ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు కృషి
- మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదికపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, కె.రాజేష్‌రెడ్డి, తదితరులు

నాగర్‌కర్నూల్/ కల్వకుర్తి/ కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన సేవలు అందించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం ప్రారంభం, జనరల్ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన, నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తిలో రూ.2 కోట్లతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ఆస్పత్రి భవనం శంకుస్థాపన, వెల్దండలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా అందించే రూ.7.13 కోట్ల రుణాల చెక్కులను మంత్రులు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రుల్లోఅధునాతన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్, జిల్లాకు ఓ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మహిళా సాధికారత దిశగా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు.

రూ.140 కోట్లతో రోడ్ల అభివృద్ధి

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వనపర్తి, జడ్చర్ల రోడ్డు, మహబూబ్‌నగర్–మన్ననూరు రోడ్డు విస్తరణకు రూ.140 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. వనపర్తి నుంచి జడ్చర్ల, మహబూబ్‌నగర్ నుంచి మున్ననూర్ వరకు ప్రధాన రహదారికి మరి కొన్ని రోజుల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు తన చారిటీ ట్రస్టు ద్వారా కృషిచేస్తానన్నారు.

రెండు ఎలక్ట్రిక్ బస్సులు

రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు రూ.50 లక్షలు మంజూరు చేస్తూ విద్యార్థుల రవాణా సదుపాయానికి ఎలక్ట్రిక్ బస్సును ఏర్పాటు చేస్తానన్నారు. జూనియర్ వైద్యులు తమ సొంత గ్రామాలను మరువవద్దని, గ్రామీణ స్థాయి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. వైద్య విద్యార్థుల కల నేటితో నెరవేరిందన్నారు. వైద్యులు రోగులకు మందులతో పాటు రోగాలు రాకుండా ముందు జాగ్రత్తగా ఎలా ఉండాలో తెలియపరచాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్, డీసీహెచ్ఎస్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుడి బలవన్మరణం


శేషయ్య (ఫైల్)

కోడేరు: పురుగుమందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్వర్ కథనం మేరకు.. మండలంలోని మాచుపల్లికి చెందిన గొల్లపల్లి శేషయ్య (55) కుటుంబ కలహాలతో గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పురుగుమందు తాగాడు. కుటుంబీకులు గుర్తించి వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శేషయ్యకు భార్య, కుమారులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


రాంచంద్రయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్‌ఐ ఆనందర్ కథనం ప్రకారం.. మండలంలోని రామనంతాపూర్‌కు చెందిన ఎన్.రాంచంద్రయ్య(55) శుక్రవారం ఉదయం గ్రామసమీపంలోని వ్యవసాయ పొలానికి బైక్‌పై వెళ్తుండగా శంకరమ్మపేటకు చెందిన వ్యక్తి పల్సర్‌పై ఎదురుగా వస్తూ రాంచంద్రయ్య బైక్‌ను బలంగా ఢీకొనడంతో కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్రంగా రాంచంద్రయ్యను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్‌కు రెఫర్ చేశారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య చూసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

- భర్త దుర్మరణం


శివకుమార్ (ఫైల్)

మరికల్: పెళ్లయిన రెండు నెలలకే యువకుడిని మృత్యువు వెంటాడింది. ఆషాఢమాసం కావడంతో భార్య పుట్టింటికి వెళ్లడంతో ఆమెను చూసేందుకు భర్త ద్విచక్ర వాహనంపై అత్తగారింటికి వెళ్తున్న క్రమంలో కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మరికల్ మండలం తీలేరు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. దేవరకద్ర మండలంలోని నార్లోనికుంట్లకు చెందిన శివకుమార్ (25)కు జక్లేర్ పరిధిలోని కాచ్‌వార్‌కు చెందిన అమ్మాయితో రెండు నెలల క్రితం వివాహం జరిగింది. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఆమెను చూసేందుకు కాచ్‌వార్‌కు వెళ్తుండగా తీలేరు సమీపంలో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివాహం అయిన రెండు నెలలకే భర్తను కోల్పోయిన భార్య, చేతికొచ్చిన కొడుకును అకాల మరణం కబళించడంతో తల్లిదండ్రులు వాపోతున్నారు.

వివాహిత బలవన్మరణం


రామేశ్వరమ్మ (ఫైల్)

ఆత్మకూర్: మతిస్థిమితం కోల్పోయిన ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ నరేందర్ కథనం ప్రకారం.. ఆత్మకూర్‌లోని బాలకిష్టమ్మ కాలనీలో నివాసం ఉంటున్న రామేశ్వరమ్మ(36) భర్తతో విడిపోయి కుమారుడితో కలిసి జీవనం సాగిస్తుంది. అయితే గురువారం అర్ధరాత్రి రామేశ్వరమ్మ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుమారుడు చుట్టు పక్కలవారికి సమాచారం ఇవ్వడంతో రామేశ్వరమ్మను కిందికి దించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందిందని ధ్రువీకరించారు. ఈ ఘటనపై శుక్రవారం కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, శవ పరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య


ఆంజనేయులు (ఫైల్)

కొత్తకోట రూరల్: డబ్బులు ఇవ్వాలంటూ వేధించడంతోపాటు దాడి చేయడంతో మనస్తాపానికి గురైన ఓ దివ్యాంగుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ఆనంద్ కథనం ప్రకారం.. మండలంలోని విలియంకొండకు చెందిన దివ్యాంగుడు బొల్లి ఆంజనేయులు(35)కు భార్య సరోజతోపాటు ముగ్గురు సంతానం. గ్రామంలో చిన్నపాటి కిరాణం పెట్టుకుని జీవిస్తున్నాడు. ఆంజనేయులు చిన్నాన్న కుమారుడు బొల్లి వంశీ తాగి వచ్చి కిరాణం దగ్గర ఉద్దెరకు సరుకులు, అవసరమైనప్పుడు డబ్బులు ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురిచేసేవాడు. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి వంశీని మందలించారు. ఈనెల 10న రాత్రి షాపు దగ్గరకు వచ్చిన వంశీ మరోమారు గొడవ పడి దూషిస్తూ.. దాడి చేశాడు. మనస్తాపానికి గురైన ఆంజనేయులు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంజనేయులు భార్య సరోజ ఫిర్యాదు మేరకు వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


బస్టాండ్ సమీపంలో రద్దీగా ఉన్న 167వ నంబరు జాతీయ రహదారి

ప్రతిపాదించారు.. పట్టించుకోరు!

- 167వ జాతీయ రహదారిపై అటకెక్కిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణం
- 2022మార్చిలో వంతెనల నిర్మాణానికి మట్టినమూనాల సేకరణ
- రూ.5.50కోట్లతో రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లకు ప్రతిపాదనలు
- ఇప్పుడు పెదవి విరుస్తున్న జాతీయ రహదారుల శాఖ


స్థల పరిశీలన చేసిన జాతీయ రహదారుల శాఖ అప్పటి ఏఈఈ, అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్

జడ్చర్ల టౌన్: పెరుగుతున్న వాహన రద్దీ.. రోడ్డు దాటేందుకు పాదాచారుల ఇబ్బందులు.. రోడ్డుప్రమాదాలు నివారించడానికి 167 జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ వంతెనల నిర్మాణాలు జాతీయ రహదారుల శాఖ ప్రతిపాదించింది. 2022లో జడ్చర్ల మున్సిపాలిటీలో రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి రూ.5.50కోట్లతో ప్రతిపాదలు సిద్ధం చేసింది. నేటికి కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

■ దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల మున్సిపాలిటీ గుండా 44, 167 రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. అయితే 167వ నెంబరు జాతీయ రహదారి మున్సిపాలిటీ పరిధి ప్రారంభం నక్కలబండతండా నుంచి గంగాపురం శివారు వరకు సుమారు 4కి.మీ మేర పట్టణంలోంచి వెళ్తుంది. దీంతో రోడ్డుపై వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతుంది. 167 నెంబరు జాతీయ రహదారి కర్ణాటక రాష్ట్రంలో మొదలై ఏపీ నుంచి తెలంగాణలోకి వచ్చి జడ్చర్ల గుండా నల్గొండ వయా కోదాడ వరకు వెళ్తుంది. మరోవైపు ఇటు కొడంగల్ వైపు కూడా 167 జాతీయ రహదారి మహబూబ్‌నగర్‌కు కలవడంతో ఆ మార్గంలో వచ్చే వాహనాలు కోదాడకు ఇదే రోడ్డుగుండా వెళ్తుంటాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతుంది. వీటితోపాటు అటు హైదరాబాద్, ఇటు కర్నూలు, మరోవైపు నాగర్‌కర్నూలు, వనపర్తి నుంచి వచ్చే వాహనాల సంగతి సరేసరి. పోలేపల్లి ఫార్మ సెజ్ కారణంగా నిత్యం వేలసంఖ్యలో ఉద్యోగులు ఇదేమార్గాన వెళ్తుంటారు. ఈ కారణంగా 167వ నెంబరు జాతీయ రహదారి రోడ్డు దాటేందుకు పాదాచారులకు ఇబ్బందిగా మారుతుంది. ముఖ్యంగా హౌజింగ్‌బోర్డు కాలనీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ అధికంగా నెలకొంటుంది. ఇక పట్టణంలో సిగ్నల్‌గడ్డ వద్ద రద్దీ అధికంగా ఉంటోంది. రోడ్డు దాటాలంటే సమయం పడుతుంది. అంతగా వాహనాల రద్దీ పెరుగుతుంది. రోడ్డుదాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

2022లో ప్రతిపాదనలు

పాదచారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జాతీయ రహదారుల శాఖ 2022లో మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తిల్లో మొత్తం 8 ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిలో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో బస్టాండ్ సమీపంలో ఒకటి, కల్వకుర్తి రోడ్డులో డిగ్రీ కళాశాల వద్ద మరోటి నిర్మించాలని మట్టి నమూనాలు సైతం సేకరించారు. ఈ మేరకు అప్పటి ఏఈఈ వినోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కమిషనర్ సునీత స్థల పరిశీలన చేసి ఆమోదించారు. కొత్త బస్టాండ్ వద్ద రూ.3.50కోట్లు, డిగ్రీ కళాశాల వద్ద రూ.2కోట్లతో వీటిని నిర్మించాలని ఉన్నప్పటికి ఆ ప్రతిపాదనలు పూర్తిగా అటకెక్కాయి. మూడేళ్లయినా వాటి ఊసేలేకుండా పోయింది. ఇప్పుడున్న జాతీయ రహదారి శాఖ అధికారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌పై పెదవి విరుస్తున్నారు.

హైస్కూల్ వద్ద నిర్మించాలన్న డిమాండ్లు

బాదేపల్లి పట్టణం సిగ్నల్‌గడ్డ హైస్కూల్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు నడుస్తున్నందున అవి పూర్తయ్యాక నిర్మాణం చేయాలని లేదంటే విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1000మందికి పైగా విద్యార్థులున్న హైస్కూల్ సాయంత్రం వేళలో రద్దీ ఏర్పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అటు బస్టాండ్, ఇటు హైస్కూల్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి అధికారులు కసరత్తు చేయాల్సి ఉంది.

సర్వేచేసి వెళ్లారు



మున్సిపాలిటీ పరిధిలో 167వ నెంబరు జాతీయ రహదారిపై 2ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లు నిర్మించేందుకు సర్వేచేసి వెళ్లారు. 2022లో జాతీయ రహదారి శాఖ ఏఈఈ సిబ్బంది మట్టినమూనాలు సేకరించారు. ఒకటేమో 8, 9 వార్డుల పరిధిలో బస్టాండ్ సమీపంలో, మరోటి 3వ వార్డు డిగ్రీ కళాశాల వద్ద నిర్మించేందుకు రూ.5.50కోట్లు కేటాయించారు. ఏమైందో తెలియదు వాటి ఊసే ఎత్తటం లేదు. – దోరేపల్లి లక్ష్మి, 8వ వార్డుకౌన్సిలర్, జడ్చర్ల మున్సిపాలిటీ

మాకేం తెల్వదు

రోడ్డుపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాల ప్రతిపాదనల విషయం మాకైతే తెల్వదు. ఆర్‌అండ్‌బీ, మున్సిపాలిటీ వాళ్లే నిర్మాణం చేసుకోవాలి. మట్టి నమూనాలు సేకరించిన విషయం, నిధులు కేటాయించిన విషయం తెలియదు. మా పరిధిలో ఇప్పుడైతే ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాల ప్రతిపాదనలు ఏవీ లేవు. – రవి, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ

నిండుగా.. జూరాల

- 10 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి


డ్యాం నుండి దిగువకు వెళ్తున్న వరద నీరు

ధరూరు: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద కాస్త పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం 1.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు 1.09 లక్షలకు పెరిగినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లు ఎత్తి 67,310 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 30,316 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 1,300, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 770, కుడి కాల్వకు 460, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.778 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. శుక్రవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 108.948 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 129.466 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

రాజోళి: సుంకేసుల జలాశయానికి శుక్రవారం ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి 49,800 క్యూసెక్కుల వరద చేరినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. 13 గేట్లను తెరిచి 51,402 క్యూసెక్కుల నీటిని దిగువ శ్రీశైలం జలాశయానికి వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయం వద్ద..

దోమలపెంట: ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శుక్రవారం శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 1,41,105 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతోంది. మూడు గేట్ల ద్వారా 81,133 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 32,220 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 20 వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.397 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 17.284 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

భర్తను కొట్టి చంపిన భార్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాంబాబు

రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కొత్తకోట రూరల్: తాగొచ్చి వేస్తున్నాడంటూ కట్టుకున్న భర్తను భార్య హతమార్చిన ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్లలో చోటు చేసుకుంది. కొత్తకోట సీఐ రాంబాబు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మణిగిళ్ల కోటయ్య (55) అమ్మపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి వద్ద పశువుల కాపరిగా పని చేస్తుండేవాడు. కోటయ్యకు భార్య అలివేలమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కోటయ్య రోజు అమ్మపల్లికి వెళ్లి పశువులు కాసి తిరిగి రాత్రి ఇంటి వచ్చేవాడు. నాలుగు రోజులుగా పనికి వెళ్లకుండా గ్రామంలోనే ఉంటూ తాగొచ్చి డబ్బుల విషయమై భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవ పడగా ఆగ్రహానికి గురై కర్రతో కోటయ్య తలపై మోదడంతో కిందపడ్డాడు. అంతటితో ఆగకుండా తలను పట్టుకొని గోడకు బాదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికొచ్చిన చిన్న కుమారుడు రమేశ్ రక్తపు మడుగులో పడి ఉన్న తండ్రిని చూసి భయాందోళనకు గురై బంధువులు, గ్రామస్తులు, మేనత్త రాములమ్మకు ఫోన్ చేసి చెప్పాడు. గ్రామస్తుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కోటయ్య చెల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం గ్రామంలో విచారణ చేపట్టి భార్య అలివేలమ్మను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంబాబు, ఎస్‌ఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

తాడూరు: ఉరేసుకుని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మేడిపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లయ్య(45) వ్యవసాయం చేసేవాడు. గురువారం రాత్రి ఇంటి ముందు ఉరేసుకుని మృతిచెందాడు. శుక్రవారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్య అక్క బాలీశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కంట్లో కారంచల్లి పుస్తెలతాడు అపహరణ

చిన్నచింతకుంట: కంట్లో కారం చల్లి వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెల తాడు అపహరించిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఉంధ్యాల సాయమ్మ గురువారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన మరికెల్ వెంకటమ్మ కంట్లో కారం చల్లి 4 తులాల బంగారు పుస్తెలతాడు అపహరించినట్లు తెలిపారు. ఈ క్రమంలో సాయమ్మ శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెంకటమ్మను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వెంకటమ్మపై కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ నాయక్ పేర్కొన్నారు.

నిందితుడికి ఏడాది జైలు

నారాయణ పేట క్రైమ్: వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఊట్కూర్ మండలం పెద్దజట్రం గ్రామానికి చెందిన నర్సప్పకు అదే గ్రామానికి చెందిన బూడిద రాములకు పాత కక్షలున్నాయి. 2016 సంవత్సరంలో నర్సప్ప పని నిమిత్తం నారాయణపేటకు వచ్చి ఓ హోటల్ వద్ద నిల్చొని ఉండగా.. బూడిద రాములు బండరాయితో తల పగలగొట్టాడు. దీంతో 24.05.2016న నారాయణపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అప్పటి ఎస్‌ఐ సాయికుమార్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆదేశాలతో కోర్టు ఏఎస్‌ఐ కృష్ణయ్యగౌడ్, సీడీఓ అరవింద్‌కుమార్ తగిన సాక్ష్యాలను ప్రవేశపెట్టగా.. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఎస్పీ వివరించారు.

ఫోర్జరీ డాక్యుమెంట్స్‌తో బ్యాంకును మోసగించిన వ్యక్తి

- రుణంతో పేరుతో రూ.90లక్షలు కాజేసిన వైనం

మహబూబ్‌నగర్ క్రైం: బ్యాంకులో తప్పుడు డాక్యుమెంట్స్ అందజేసి భారీ స్థాయిలో డబ్బులు రుణంగా తీసుకుని మోసం చేసి వ్యక్తిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం..పట్టణంలోని ఓ బ్యాంకులో ఓ వ్యక్తి గత ఏడాది భూమికి సంబంధించి ఫోర్జరీ చేసిన నకిలీ డాక్యుమెంట్స్‌ను షూరిటీగా పెట్టి రూ.90 లక్షలు రుణంగా తీసుకున్నాడు. రుణం తీసుకున్న తర్వాత డబ్బులు తిరిగి చెల్లించలేదు. దీనిపై బ్యాంకు అధికారులు విచారణ చేయగా ఫోర్జరీ డాక్యుమెంట్స్ పెట్టినట్లు గుర్తించారని సంబంధిత బ్యాంకు నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మెరిట్ కమ్ సీనియారిటీతో ఉద్యోగులకు అన్యాయం


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామనోహర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మెరిట్ కమ్ సినియారిటీ విధానాన్ని విద్యుత్ సంస్థలో ప్రవేశపెట్టడంతో విద్యుత్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల ఎత్తివేయాలని యాజమాన్యం చూస్తుందని, దాని అడ్డుకునేందుకు విద్యుత్ ఉద్యోగులు ఒక్క తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రయ్య మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో మన అసోసియేషన్ పోరాటం ద్వారా కాంట్రాక్ట్ పద్ధతి రద్దయి వారిని ఆర్టిజన్ ఉద్యోగులుగా తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శి బీచుపల్లి, రిజినల్ కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర అడిషనల్ ప్రధాన కార్యదర్శి సోమ్లానాయక్, అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లి లిఫ్ట్ మోటారు ప్రారంభం



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని గుడిపల్లి కేఎల్‌ఐ మూడో లిఫ్ట్ వద్ద ఒక మోటారును శుక్రవారం ప్రారంభించి నీటి ఎత్తిపోతను ప్రారంభించారు. కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం నిండుకుండగా మారి బ్యాక్‌వాటర్ గణనీయంగా పెరగడంతో మూడు రోజుల కిందట ఎల్లూరు లిఫ్ట్ వద్ద నీటి ఎత్తిపోతను ప్రారంభించిన కేఎల్‌ఐ అధికారులు శుక్రవారం గుడిపల్లి గట్టు వద్ద గల లిఫ్ట్ నుంచి ఎత్తిపోతను ప్రారంభించారు.

బీసీలను మళ్లీ మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలను మోసం చేయాలని చూస్తుందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా లేదని, అందుకే మొదటి నుంచి కులగణనలో కూడా శాస్త్రీయతను పాటించకుండా ఎన్నికల నిర్వహణపై దాటవేత ధోరణిని అవలంభిస్తుందన్నారు. ప్రభుత్వానికి స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ, మండలిలో బిల్లు ఆమోదం పొందగానే గవర్నర్‌తో ఆమోదింపజేసుకొని గెజిట్ తీసుకొచ్చి ఎన్నికలు నిర్వహించేదన్నారు. కానీ, ఏడాదిపాటు ఎన్నికలు నిర్వహించకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి ఇప్పుడు ఆర్డినెన్స్ తెచ్చి కోర్టుల్లో వీగిపోయేలా చేసే కుట్రకు మరోసారి తెరలేపిందన్నారు. బీసీ సంక్షేమం, రాజకీయ, విద్య, ఉద్యోగ ప్రయోజనాలను పరిరక్షించాలంటే 9వ షెడ్యూల్ మాత్రమే శరణ్యమన్నారు. ఎన్నికల సమయంలో బీసీలను ఆకర్శించేందుకు తాత్కాలికంగా తీసుకొచ్చే ఈ విధమైన ఆర్డినెన్స్ కోర్టులో నిలబడవని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాన్ని తీసుకెళ్లి పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం తెలిపిన తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చేలా కృషి చేయాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేని పక్షంలో గతంలో అధికారంలోకి రావడానికి బీసీలు ఏ విధంగా కృషి చేశారో ఇప్పుడు దూరం చేయడానికి అలాగే బీసీ సమాజం మొత్తం ముందుకు వెళ్తుందన్నారు. సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు లక్ష్మీకాంత్, కృష్ణ, బుగ్గన్న, మహేందర్, ఆశన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో తోకల మల్లయ్య మృతి


మృతదేహానికి పోస్టుమార్టం చేస్తున్న వైద్యులు

మన్ననూర్: అప్పాపూర్ గ్రామానికి చెందిన తోకల మల్లయ్య కొన్ని రోజుల క్రితం నల్లమల అటవీ ప్రాంతంలో అదృశ్యమైన ఘటన తెలిసిందే. 12 రోజులుగా మల్లయ్య బంధువులు ఆయన జాడ కోసం వెతుకుతున్న క్రమంలో గ్రామానికి సుమారు 3 కిలో మీటర్ల దూరంలో గురువారం ఓ చెట్టు కింద కుళ్లిపోయిన శవాన్ని వారు గుర్తించారు. ఈ క్రమంలో మృతుడి భార్య తోకల లింగమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో లింగాల ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు, వైద్యులు, అటవీశాఖ సిబ్బంది శుక్రవారం ఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల సూచన మేరకు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఇది ఇలా ఉండగా మృతదేహంపై ఉన్న గాయాలను బట్టి ఎలుగుబంటి దాడి చేయడంతోనే మల్లయ్య మృతి చెంది ఉండవచ్చని అటవీ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం రిపోర్టు అనంతరం మృతికి సంబంధించిన విషయాలు నిర్ధారణ అవుతుందని వైద్య సిబ్బంది తెలిపారు.

రూ.18.50 లక్షలు సైబర్ మోసం

చిన్నచింతకుంట: రోజురోజుకు సైబర్‌నేరగాళ్ల మోసాలకు అడుపు అదుపు లేకుండాపోతుంది. ఒక్క ఫోన్ కాలుతో అమాయకులకు ఫోన్ చేసి మాయ మాటలు చెప్పి ఖాతాలనుంచి లక్షల డబ్బులు స్వహా చేస్తున్నారు. తాజాగా ఓ వ్యక్తికి ఖాతా నుంచి 18.50 వేల రుపాయలు స్వహా చేసిన సంఘటన కొకుంట్ల మండలం ముచ్చింతల గ్రామంలో చోటు చేసుకుంది.ఈ సంగటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చింతల గ్రామానికి చెందిన కల్వ కన్నయ్యకు గత నెల 19వ తేదిన గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ ఆధార్ కార్డు మిస్ యూస్ అయిందని దాని రెగ్యూలర్ చేయాలన్నారు.మీ సంబందిత బ్యాంకుకు వెళ్లి మేము చెప్పినట్లు చేయాలని నమ్మించారు. వారు చెప్పిన విదంగానే భాధితుడు బ్యాంకుకు వెళ్లి ఆర్‌టీజీఎస్ ద్వారా ముందుగా 6 లక్షలు తరువాత 10 లక్షలు వేశారు. మరుసటి రోజు2.50 వేలు వేశారు. ఆ డబ్బులు ఇన్ని రోజులైన తిరిగి రాక పోయే సరికి మోసపోయానని భావించి శుక్రవారం చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం

మహబూబ్‌నగర్ క్రైం: ఫోన్‌లో రీల్స్ చూస్తున్న ఓ యువకుడికి దాంట్లో వచ్చిన ప్రకటన(యాడ్)పై క్లిక్ చేయడంతో సైబర్ నేరగాళ్లు మోసగించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. పట్టణంలోని షాషాబ్‌గుట్టకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇటీవల ఇన్‌స్టాగామ్‌లో రీల్స్ చూస్తుండగా ఓ యాడ్‌పై క్లిక్ చేయడంతో వాట్సాప్‌కు లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేయడంతో ఓపెన్ కాగా వర్క్‌ఫ్రం హోం ఉద్యోగం ఇస్తామని నమ్మించి అతని నుంచి రూ.46వేలు ఆన్‌లైన్‌లో వేయించుకుని మోసగించారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

